# పేపర్

"పేపర్!...."

వీధిలోంచి గట్టిగా కేకేసి పేపర్‌వాడు న్యూస్ పేపర్ గిరాటేసి వెళ్ళిపోయాడు.

రాజారావు ఇంట్లోంచి వచ్చి గేటు దగ్గర పడివున్న న్యూస్‌పేపర్ తీసుకుని వరండాలో కుర్చీలో కూర్చున్నాడు.

ఇంక న్యూస్ చదువుదామని అనుకునేంతలో భార్య రమణి "ఏవండోయ్...." అంటూ భయంకరంగా కేకపెట్టింది వంటింట్లోంచి.

ఆ కేకకి రాజారావు ఉలిక్కిపడ్డాడు. అతని మనసు కీడుని శంకించింది.

గదిలోకి వెళ్ళి దుప్పటి తీసుకుని వంటింట్లోంచి పరిగెత్తాడు.

"ఏంటా!పరుగు ఏమాలోకం?...." అంది రమణి ఆశ్చర్యంగా చూస్తూ.

"నీ చీరేం అంటుకోలేదా?...." ఇంకా ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు రాజారావు.

"లేదే?.... ఎందుకలా అడుగుతున్నారు!"

"మరి వంటింట్లోంచి అలా గావుకేకలేస్తే ఏమనుకుంటారు?.... చూడు నీ మీద కప్పి మంటలార్పడానికి దుప్పటి కూడా తెచ్చాను...." విసుక్కున్నాడు రాజారావు.

"తెచ్చార్లే పేద్ద దుప్పటి.... మంటలార్పడానికి అంత చిన్నదీ, అంత పల్చని దుప్పటి తెస్తారా బాగా దళసరిగా, పెద్దగా ఉన్న దుప్పటి తేవాలిగానీ!.... కావాలనే అలాంటి దుప్పటి తెచ్చారు నేను చస్తే వేరే దాన్ని చేసుకోవాలని" మెటికలు విరిచింది రమణి.


"నువ్వూ కావాలనే అంత గాఠిగా అరిచావ్ నేనదిరిపడి గుండాగి

ఛస్తే నీ కిన్సూరెన్సు డబ్బు వస్తుందని...." రాజారావు కూడా మెటికలు విరిచి "బాబోయ్" అంటూ చేలివేళ్ళవంక చూస్కున్నాడు.

"మరేం ఆడంగి అలవాట్లు కాపోతే మిమ్మల్నెవరు మెటికలు విరవ మన్నారు.... వేళ్ళిరిగాయా?"

"నాకేం కాలేదుగా.... హి హి హి.... చూడు కావాలంటే మళ్ళీ విరుస్తా" అంటూ మళ్ళీ మెటికలు విరిచి "వ్యాయ్యోవ్...." అన్నాడు బాధగా మరోసారి వేళ్ళవంక చూస్కుంటూ.

"ఇంకాపుతారా చేతికున్న పదివేళ్ళూ విరిగిపోవాలా?"




"ఇంతకీ నన్నెందుకు పిలిచావ్?" చేతివేళ్ళని ఊదుకుంటూ అడిగాడు రాజారావ్.

"ఇంట్లో కూరల్లేవు.... బజారెళ్ళి తేడానికి పిలిచాను....

రాజారావు ఆశ్చర్యంగా చూశాడు.

"ఆ మాట చెప్పడానికి అంత గావుకేకపెట్టి పిలిచావ్?"

"నేనెప్పుడూ అలానే పిలుస్తాను.... ఈ వేళ కొత్తేం ఉంది?....

లేకపోతే మీరు వినబడదుగా, ఆ దిక్కుమాలిన పేపర్లో మునిగిపోతారు. అంతిదిగా చదవడానికి ఆ పేపర్లో ఏముంటుందో?....”

“వార్తలు!....”

“ఆ చదివార్లే వార్తలు!.... అందరూ చదవట్లేదు మీకొక్కరే చదువుతున్నారు. వేరేవాళ్ల పేపరు చదివినా ఇంటి విషయాలు పట్టించుకుంటారు మీరు మాత్రం దాంట్లో మునిగిపోయి ఏమీ పట్టించుకోరు. పేపర్లోని ప్రతి అక్షరం చదివి తీరాలా?....”

“నన్నాడిపోసుకుంటావ్ గానీ మీ నాన్నగురించి అనవేం?.... నేనే నయం ఇంట్లో కుర్చీలో కూర్చుని చదువుకుంటాను. మీ నాన్నైతే పేపర్ని లెట్రిన్ లోకి తీస్కెళ్ళి కూర్చుంటారు ఇవతల ఎవరికైనా అర్జంటైతే చావాల్సిందే....”

“ఎంతసేపూ మా పుట్టింటోళ్ళని ఆడిపోసుకుంటారేం? మెటికలు విరిచింది రమణి.

“మరి నన్నాడిపోసుకుంటే నేనాడిపోస్కోనా?” రాజారావు కూడా మెటికలు విరిచి “హబ్బా!.... ఉస్....” అన్నాడు వేళ్ళు చూస్కుంటూ.

“ఇంతకీ కూరగాయలు తెస్తారా లేదా?”

“లేను.... నేను వార్తలు చదువుకోవాలి.... ఈ వాల్టికి ఏదో ఒక కూర చెయ్.... తరువాత వీధిలోకి కూరగాయల బళ్ళు వస్తాయ్‌గా అప్పుడు కొనుక్కో....” అని చెప్పి వరండాలోకి వచ్చి పేపరు పట్టుకుని కూర్చున్నాడు రాజారావు.

సరిగ్గా అప్పుడే ఒక వ్యక్తి వచ్చాడు.

“ఏమండీ....” అంటూ రాజారావుని పిలిచాడు అతను.

రాజారావు అప్పటికే పేపర్లో మునిగిపోయాడు.

“ఏవండీ....” మరోసారి పిలిచాడు అతను. రాజారావు పలకలేదు. మరో రెండుసార్లు పిలిచాడు. అయినా లాభం లేకపోయింది.

“ఏవండోయ్....” గావుకేక పెట్టాడు అతను.

రాజారావు విసుగ్గా ఇంట్లోంచి చూస్తూ అన్నాడు.

"నేను కూరగాయలు తేనని చెప్పానా?.... ఏంటా గావుకేకలు.... అరిచి అరిచి నీ గొంతెలా బొంగురుపోయిందో చూడు"

ఆ వ్యక్తి కంగారు పడిపోయాడు.

"ఏవండీ.... ఇటండీ.... ఇటు ..." అన్నాడు.

రాజారావు తల తిప్పి అతన్ని చూశాడు.

"ఇప్పుడు పిలిచింది మీరా?"

"అవునండీ.... నా పేరు సింగినాథం అండీ.... మరేమోనండీ ఈ పక్కింట్లో కండీ కొత్తగా దిగానండీ...."

"ఓహో.... నా పేరేమో రాజారావు...."

"నాకు తెలుసండీ.... మీ గురించి అన్నీ తెల్సుకునే వచ్చానండీ"

"కూర్చోండి...." అన్నాడు రాజారావు.

"అబ్బే.... నాకు కూర్చోడానికి టైం లేదండీ.... బోల్డన్ని వార్తలు చదువుకోవాలండీ...." అన్నాడు సింగినాథం.

"మీ ఇంట్లో ఏ పేపరు తెప్పిస్తారు?" ఆశగా అడిగాడు రాజారావు తన 'తెలుగుదిబ్బ' చదివేసిన తరువాత ఆ పేపరు తీస్కొని చదువ దామని.

"మా ఇంట్లోనండీ ఏ పేపరూ తెప్పించమండీ...."

"మరి మీరు వార్తలు ఎలా చదువుతారు?...." ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

"అదంటండీ.... మీ పేరుంది కదండీ.... భలే వారండీ మీరు ... భలే జోకులేస్తారండీ.... ఓసారి మీ పేపరివ్వండి చదివేసి ఇస్తాను...." అన్నాడు సింగినాథం.

రాజారావు గిలగిలలాడి పోయాడు.

"కానీ నేను చదవలేదే!" అన్నాడు.

"నేను చదివాక ఇస్తానుగా.... అప్పుడు చదువుదువుగాని...."

రాజారావుకి ఏమనాలో తోచలేదు. మనిషి చూస్తే కొత్తవాడు ఏమనటానికి మొగమాటం.

"నేను మొదటి పేజీ చదివేశాను.... మీరిది తీస్కెళ్ళి చది

తెండి.... ఈ లోగా నేను వేరే పేజీలు చదివి ఇస్తాను...." అంటూ మొదటి పేజీ చింపి సింగినాథానికి ఇచ్చాడు రాజారావు. సింగినాథం రాజారావుకి థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

రాజారావు రెండు నిముషాలు పేపరు చదివాడో లేడో ఒక పాతికేళ్ళ యువకుడు వచ్చాడు.

"ఎవరు బాబూ నువ్వు!...." అని అడిగాడు రాజారావు.

"మేము ఈ పక్కనే ఉంటామండీ.... సింగినాథంగారినీ మా నాన్నగారన్నమాట!.... నా పేరు రవీంద్ర" అన్నాడు.

"మీ నాన్నగారితో చెప్పు.... తానింకా రెండో పేజీ చదవలేదని" అన్నాడు రాజారావు పళ్ళునూరుతూ.

"అబ్బే.... నేను మా నాన్నగారి గురించి రాలేదండీ.... నాకే వేరేపనుంది...."

"ఏంటది?"

"మీ ఇంట్లో తెలుగు దిబ్బ పేపరే కదా తెప్పిస్తారు?"

"అవును! ఏం?" అన్నాడు రాజారావు తెలుగు దిబ్బని వెనక్కి దాచేస్తూ.

"మీరలా దాచెయ్యకండి ప్లీజ్.... నాకు స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం.... మీ న్యూస్ పేపర్లో ఆఖరి పేజీ ఇవ్వండి.... చదివిన వెంటనే తెచ్చిస్తా...." అన్నాడు రవీంద్ర.

"ఊహు.... నేనివ్వను...." అన్నాడు రాజారావు.

రవీంద్ర రాజారావుని బ్రతిమలాడి ఆఖరి పేజీ లాక్కెళ్ళిపోయాడు.

మరో రెండు నిముషాలకి ఒక ఆరేళ్ళ బాబు వచ్చాడు.

"ఎవరు బాబూ నువ్వు?" అడిగాడు రాజారావు.

"సింగినాథం గారబ్బాయినండీ.... మా అమ్మగారేమో మీ దగ్గరికి పంపారండీ...."

"ఎందుకూ?...." ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

"మరేమోనండీ.... మా చెల్లెలు కేమోనండీ రెండేళ్ళనండీ... అదేమోనండీ ఇంట్లోనండీ...." అంటూ రెండు వేళ్ళు చూపించాడు.

"అయితే?"

"మరేమోనండీ మా ఇంట్లో పాత బట్టలు లేవండీ.... అందకనండీ మీ పేపర్లు అడ్వర్‌టైజ్ మెంట్లుండే కాగితం ఉంటుంది కదండీ.. అది మీకు పనికిరాదు కదండీ.... అదిస్తే మా అమ్మ దాంతో ఎత్తిపారేస్తదంటండి...." అన్నాడు.

రాజారావు విసుక్కుంటూ న్యూస్ పేపర్లోంచి అడ్వర్‌టైజ్ మెంట్లున్న పేపరిచ్చాడు.

ఆ బాబు వెళ్ళగానే సింగినాథం మళ్ళీ తయారయ్యాడు.

"మొదటి పేజీ చదివేశాగా.... ఇంకో పేజీ ఇవ్వండి" అన్నాడు

రాజారావు తలపట్టుకున్నాడు.

ఇలా రోజూ జరగడం మొదలయ్యింది. ఒకరోజు పేపర్‌కుర్రాడు న్యూస్ పేపరెయ్యకుండాపెళ్ళిపోతుంటే రాజారావు పిలిచి అడిగాడు.

"మీకిచ్చిన వెంటనే ఎలాగూ వాళ్ళు ఒక్కో పేపరూ పట్టుకెళ్ళిపోతారు కదండీ... అందుకే ఏకంగా వాళ్ళింట్లోనే పేపరేసేశానండీ.... వాళ్ళు చదివిన తరువాత మీకిస్తారు" అని సమాధానం చెప్పి వెళ్ళిపోయాడు పేపర్ కుర్రాడు.

ఇలా లాభం లేదని రాజారావు పేపర్ తెప్పించడం మానేశాడు.

ఒక రోజు రాజారావు వరండాలో కూర్చుని ట్రాన్సిస్టర్లో వార్తలు వింటున్నాడు. అంతలో సింగినాథం వచ్చాడు.

"నేను పేపర్ తెప్పించడం మానేశాగా?.... అది మీకు తెల్సుగా?" చిలిపిగా అన్నాడు రాజారావు.

"తెల్సు.... కానీ న్యూస్ తెలుసుకోపోతే నాకు తోచదే మరి.... మరేమోనండీ.... మా ఇంట్లో ట్రాన్సిస్టర్ లేదండీ.... మరి వార్తలు వినాలంటే ట్రాన్సిస్టర్ కావాలికదండీ.... అందుకనేనండీ.... మరేమోనండీ.... సింగినాథం చెప్తున్నాడు.

రాజారావు నోరు తెరుచుకుని వింటున్నాడు.